సాక్షి ఒడిశా

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.12,13,154లు, బంగారం 2 గ్రాముల 350 మిల్లీగ్రాములు, వెండి 9గ్రాముల 300 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



క్యాపిటల్ థానా ముట్టడి

ఆటోడ్రైవర్లు క్యాపిటల్ థానా ముట్టించారు. అరెస్టులపై ఆగ్రహం తెలిపారు.

- IIలో▸



నష్టపరిహారం కోసం రాస్తారోకో

ప్రమాదంలో నష్టపరిహారం కోసం బాధితులు రాస్తారోకో చేశారు. రామనగుడ రహదారిని బంధించారు.

- IIలో▸

న్యూస్‌రీల్

తరలిపోతున్న రుతు పవనాలు



వాతావరణ శాఖ జారీ చేసిన రుతు పవనాల తరలింపు ప్రాంతాల చిత్రం

భువనేశ్వర్: రాష్ట్రం నుంచి రుతు పవనాలు క్రమంగా వెడలిపోతున్నాయి. పశ్చిమ, ఉత్తర ఒడిశా ప్రాంతాల్లో పలు జిల్లాల నుంచి రుతు పవనాలు తరలిపోయాయి. ఝార్సుగుడ, సుందర్‌గఢ్, బర్‌గఢ్, కెంఝొహర్, మయూర్ భంజ్ జిల్లాల నుంచి రుతుపవనాలు మంగళ వారం తరలిపోయినట్లు వాతావరణ శాఖ సమాచారం.

మనేంగులు గ్రామాన్ని పంచాయతీగా గుర్తించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పుటాసింగి పంచాయతీలో ఉన్న మనేం గులు గ్రామాన్ని పంచాయతీగా గుర్తించాలని 12 గ్రామాలకు చెందిన ప్రతినిధులు సబ్ కలెక్టర్ కార్యాలయం అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. పుటాసింగి పంచాయతీ పరిధి కుభులంసి, గాయులంగి, గుణుదురుబ, పాడలకిపాయి, రుడిసిన్, ఆబాసి, లింగియార్, జంగ్‌జంగ్, బాసేంగొగొరొజాంగొ, సొలాడంసి, లయిబ గ్రామాల ప్రజలు పంచాయతీ కేంద్రానికి చేరుకోవాలంటే 15 కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. అందువల్ల మనేంగులు గ్రామాన్ని పంచాయతీగా గుర్తించగలిగితే తాము ఎన్నో సమస్యల నుంచి గట్టెక్కుతామని వివరించారు. అదేవిధంగా గ్రామాలు కూడా అభివృద్ధి చెంది మౌలిక సౌకర్యాలు పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

డాక్టర్ తిరుపతి పాణిగ్రాహికి ఐసీఎఫ్‌ఏఐ జీవన సాఫల్య పురస్కారం



డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి

భువనేశ్వర్: హైటెక్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహికి ఐసీఎఫ్ఏఐ విశ్వవిద్యాలయం జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేసింది. సిక్కిం గ్యాంగ్‌టక్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ ఫైనాన్షియల్ అనలిస్టిస్ ఆఫ్ ఇండియా (ఐసీఎఫ్ఏఐ) విశ్వవిద్యాలయం 18వ స్నాతకోత్సవం, సిక్కిం 50వ వార్షికోత్సవం పురస్కరించుకుని హై టెక్ గ్రూప్ వ్యవస్థాపకుడు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహికి ఈ పురస్కారం ప్రదానం చేయడం విశేషం. ఒడిశాలో విద్య, ఆరోగ్య రంగంలో విప్లవాత్మక పరివర్తనకు, జీవితకాల అంకితభావానికి గాను జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించనున్నట్లు ఐసీఎఫ్ఏఐ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ తెలిపారు. ఈ సందర్భంగా భారత దేశంలోని అనేక మంది ప్రముఖులను సత్కరించనున్నారు.

అన్నని హత్య చేసిన తమ్ముడు అరెస్టు



పోలీసులు అదుపులో ఉన్న మఖర హరిజన్

కొరాపుట్: అన్నని హత్య చేసిన తమ్ముడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీస్‌స్టేషన్ ఒక ప్రకటనలో ఈ వివరాలు ప్రకటించింది. ఈనెల 11వ తేదీన సింధిగుడ గ్రామంలో ధనుర్జయ హరిజన్ (40)ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని అతని సోదరుడు రాజు హరిజన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు విచారణ చేపట్టిన పోలీసులు గ్రామంలో పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. దీంతో మృతుడి మరో తమ్ముడు మఖర హరిజన్ ఇంట్లో ఎవరూ లేనప్పుడు ధనుర్జయ ముఖంకి వస్త్రం కప్పి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్లు తేలింది. పోలీసుల విచారణలో నిందితుడు తన నేరం అంగీకరించాడు. నిందితుడు మఖర్ హరిజన్‌ని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకి తరలించారు.

మహిళలకు వడ్డీ రహిత కారు రుణం



భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం 'అమొ సువాహక యోజన' కింద మహిళల స్వయం సమృద్ధి సాధనకు కారు కొనుగోలుకు సహాయం చేయనుంది. నాలుగేళ్లలో కారు కొనడానికి అంచెలంచెలుగా 1,100 మంది మహిళలకు ఈ సౌలభ్యం కల్పిస్తుంది. మొదటి సంవత్సరంలో 200 మంది మహిళలు, రెండో సంవత్సరంలో 250 మంది, మూడో సంవత్సరంలో 300 మంది, నాల్గో సంవత్సరంలో 350 మంది మహిళలు ప్రయోజనం పొందుతారు. వీరిలో ఒక్కొక్కరికి రూ. 10 లక్షల వరకు వడ్డీ లేని రుణం ప్రభుత్వం అందజేస్తుంది. ఈ వ్యయ ప్రణాళిక అంచనా రూ. 46.66 కోట్లు. ఈ సదుపాయం పొందిన మహిళలు కారును టాక్సీలుగా వినియోగించాల్సి ఉంటుంది. వారు ఐదేళ్ల నిడివిలో సమాన వాయిదాలలో ప్రధాన రుణ మొత్తాన్ని తిరిగి చెల్లించడం నిబంధన. రుణ మొత్తంపై 11 శాతం వార్షిక వడ్డీ రేటుతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా చెల్లిస్తుంది. వాణిజ్యం, రవాణా శాఖ ప్రతిపాదించిన ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 3 లక్షలకు పరిమితమైన 21 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల మహిళలకు ఈ పథకం వర్తిస్తుందని రాష్ట్ర వాణిజ్య, రవాణా శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెనా మంగళ వారం తెలిపారు. డిసెంబర్ 2023లో ప్రారంభించిన సువాహక్ చొరవ విస్తరణగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు డ్రైవింగ్ ఇన్స్టిట్యూట్‌లలో శిక్షణ పొందిన 6,000 మందికి పైగా మహిళలకు ఈ పథకం కింద ప్రోత్సాహం లభిస్తుంది. రాగల 4 ఆర్థిక సంవత్సరాల్లో మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కోసం సహాయపడటం ఈ పథకం లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ బస్సులు నడపడంలో నిమగ్నమై ఉన్న మహిళలు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు మరియు సుభద్ర లబ్ధిదారులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. పర్యావరణ అనుకూల రవాణాను ప్రోత్సహించడానికి, విద్యుత్ వాహనాలను (ఈవీ) ఎంచుకునే మహిళలకు రాష్ట్ర ఈవీ విధానానికి అనుగుణంగా రూ. 2 లక్షల ప్రోత్సాహకం లభిస్తుంది. రోడ్డు పన్ను మరియు రిజిస్ట్రేషన్ ఫీజుల నుండి మినహాయింపులు లభిస్తాయని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి సడక్ సురక్ష మౌళిక అభివృద్ధి యోజన కింద బడ్జెట్ కేటాయింపుల నుంచి నిధులు సర్దుబాటు చేసే యోచన ఉన్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం

- డీసీసీ అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక



అప్పలస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని డీసీసీ అధ్యక్షుడు, రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో డీసీసీ అధ్యక్షునిగా నియమితులైన ఆయనకు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు జిల్లాలో ఎంతగానో ఆదరించారని, దీని ఫలితంగానే జిల్లాలోని మూడు శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగలిగారన్నారు. అదేవిధంగా కొరాపుట్ లోక్‌సభ స్థానాన్ని కూడా కాంగ్రెస్ కైవసం చేసుకుందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో పార్టీ మరింత బలం పుంజుకునేందుకు తాను కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు డీసీసీ పదవిని ఇచ్చిందన్నారు. తనకు ఇచ్చిన బాధ్యతను సద్వినియోగం చేసి అందరి సహకారంతో ముందుకు నడిపిస్తానని వెల్లడించారు. అనంతరం లోక్‌సభ ఎంపీ సప్తగిరి ఉలక మాట్లాడుతూ.. పార్టీలో ఎంతోమంది సీనియర్ నాయకుల సలహాలు తీసుకొని పార్టీని ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యకర్తలంతా సమష్టిగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుణుపుర్ ఎమ్మెల్యే సత్యజీత్ గొమాంగో, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, సీనియర్ నాయకురాలు రత్నమణి ఉలక తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కాల్చేందుకు 2 గంటలు అనుమతి

భువనేశ్వర్: ఈ సారి దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చడంపై ఆంక్షలు విధించారు. పండగ నాడు 2 గంటల పాటు బాణసంచా కాల్చేందుకు అనుమతించారు. దీపావళికి ముందుగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు మార్గదర్శకాలు జారీ చేసింది. ఆ రోజు సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు బాణసంచా కాల్చేందుకు అనుమతించినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. బాణసంచా కాల్చే సమయంలో భద్రతతో మెసలుకోవాలని సూచించారు.

- అధిక పేలుడు శబ్ద బాణసంచా నిషేధం.
- బాణసంచా పేలుడు శబ్దం పరిమితి 125 డీబీ మించరాదు.
- శాంతియుత ప్రాంగణాలు పార్కులు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, న్యాయ స్థానాలు, ధార్మిక సంస్థల ప్రాంతాల్లో 100 మీటర్ల పరిధిలో బాణసంచా కాల్చడం నిషేధం.
- సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో హరిత (కాలుష్య రహిత) బాణసంచా కాల్చేందుకు అనుమతి.
- పదేళ్ల లోపు బాలలు పేలుడు బాణసంచా కాల్చడం నిషేధం.
- బాణసంచా కాల్చే సమయంలో నూలు వస్త్రాలు ధరించడం శ్రేయస్కరం.
- బేరియం తదితర నిషేధిత పదార్థాల బాణసంచా నిషేధం.
- నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతారు.
- నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి స్థానిక జిల్లా మేజిస్ట్రేట్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్, సహాయ పోలీసు సూపరింటెండెంట్, డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ మరియు సబ్ డివిజనల్ పోలీసు అధికారికి ఫిర్యాదు చేయవచ్చు.

వాంతి నెపంతో ఉడాయించిన ఖైదీ

భువనేశ్వర్: నేరారోపణతో ఖైదు అనుభవిస్తున్న నిందితుడు కారాగారం నుంచి ఉడాయించాడు. వాంతి చేస్తానని సెల్ నుంచి బయటకు వచ్చినట్లు వచ్చి పారిపోయినట్లు కారాగార వర్గాల సమాచారం. ఈ సంఘటన నగరం శివార్లు చందక పోలీస్ థానాలో మంగళ వారం చోటు చేసుకుంది. ఇద్దరు కానిస్టేబుళ్ల నుంచి విదిలించుకుని పారిపోయినట్లు సమాచారం. ఖైదీ పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన వాడు.

విజృంభిస్తున్న చర్మ వ్యాధులు



వాగు దాటి గ్రామానికి చేరుకుంటున్న వైద్య బృందం

- మునిసిపాదొరొకు వైద్య బృందం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి డొంగాశిలి పంచాయతీలోని మునిసిపాదొరొ గ్రామంలో గత రెండు రోజులుగా చర్మ రోగాలు విజృంభిస్తున్నాయి. శరీరంపై దుద్దుర్లు ఏర్పడి అనంతరం అవి గాయాలుగా మారుతుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధి సోకినవారిలో అత్యధిక శాతం మంది చిన్నారులే కావడం విశేషం. సమాచారం తెలుసుకున్న ఉత్కళ అలూమిన కర్మాగారానికి చెందిన ప్రత్యేక వైద్య బృందం మునిసిపాదొరొ గ్రామానికి సోమవారం వెళ్లారు. గ్రామానికి చేరుకునేందుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో పాటు మధ్యలో పెద్ద వాగును దాటుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని వైద్య బృందం తెలియజేశారు. గ్రామానికి చేరుకున్న వెంటనే వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి రక్త పరీక్షలను చేపట్టారు. మరి కొందరికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. అయితే చర్మ రోగాలు సోకడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. గ్రామస్తులు వినియోగిస్తున్న తాగునీటిని వైద్య బృందం పరిశీలించారు. డాక్టర్ దేవేంద్ర రౌత్ నేతృత్వంలో వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించారు. అయితే వ్యాధిపై ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

గంజాయితో పట్టుబడిన కంటైనర్



పట్టుబడిన లారీ, నిందితులు, గంజాయి బస్తాలను చూపిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి లావణ్యగడ వద్ద మంగళవారం ఎక్సైజ్ శాఖ ఒక కంటైనర్‌లో సోదాలు చేయగా, అందులో గంజాయి ప్యాకెట్లు బయటపడినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమార్ పటేల్ తెలియజేశారు. వెంటనే కంటైనర్ డ్రైవర్, హెల్పర్ పారిపోగా.. అందులో ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారిలో జిరంగో గ్రామానికి చెందిన సుమేష్ లిమ్మా, ఆర్.ఉదయగిరికి చెందిన జోథామ్ లిమ్మా ఉన్నారు. ఈ పార్శిల్ కంటైనర్ హర్యానా రాష్ట్రం నుంచి వస్తువులు జిల్లాకు చేరవేసి, తిరిగి వెళ్లే సమయంలో గంజాయిని తరలిస్తున్న వచ్చిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం దాడులు చేసి పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు 41.5 క్వింటాళ్లు ఉండగా.. దీని విలువ సుమారు రూ.45 లక్షలు ఉంటుందని వెల్లడించారు. గజపతి జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహు ఆదేశాల మేరకు ఈ దాడులు జరిగినట్లు ఎక్సైజ్ అధికారి కె.బాలాజీరావు తెలిపారు. దాడుల్లో విజయకుమార్ మల్లిక్, నీలాంబర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో రెండు బాణసంచా గోదాములు సీజ్



కాశీనగర్ రోడ్డులో బాణసంచా హోల్ సేల్ దుకాణంలో ఎస్పీ జి.ఎస్.పండా తనిఖీలు



పర్లాకిమిడి-కాశీనగర్ రోడ్డులో హోల్ సేల్ దుకాణంలో అక్రమ బాణసంచా నిల్వలు తనిఖీ చేస్తున్న ఎస్పీ పండా

పర్లాకిమిడి: స్థానిక పర్లాకిమిడి–కాశీనగర్ రోడ్డులో లైసెన్సు లేకుండా అధిక మొత్తంలో బాణసంచాను నిల్వ ఉంచిన రెండు ప్రముఖ క్రాకర్స్ వర్తకుల దుకాణాల గోదాములపై మంగళవారం మధ్యాహ్నం దాడులు జరిపి ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా సీజ్ చేశారు. ఈ దాడుల్లో లాడి కృష్ణమూర్తి, సాంబ గోదాములు, దుకాణాల్లో సుమారు రూ.50 లక్షల బాణసంచా అక్రమంగా ఉన్నట్లు పోలీసులు కనుగొన్నారు. దాడుల్లో ఎస్‌డీపీఓ మాధవానంద నాయక్ సిబ్బంది పాల్గొని వారిపై రెండు కేసులను నమోదుచేశారు.

బృందావన్ ప్యాలెస్‌కు ఇకపై ఎంట్రీ ఫీజు



మహేంద్రతనయ నది వద్ద బృందావన్ ప్యాలెస్



పాడైన లోపలి ఎంట్రన్స్ భాగం



కొత్తగా ఏర్పాటుచేసిన టికెట్ కౌంటర్



ఎంట్రన్సు గేటు వద్ద టూరిజం శాఖ ఏర్పాటు చేసిన నేమ్‌బోర్డు

పర్లాకిమిడి: పట్టణంలో ఒడిషా, ఆంధ్ర సరిహద్దు మహేంద్రతనయ నది ఒడ్డున ఉన్న అతి పురాతనమైన భవంతి బృందావన్ ప్యాలస్‌కు మరమ్మతులు చేసి పర్యాటకులకు అందుబాటులో ఉంచడానికి కలెక్టర్ మధుమిత టూరిజం శాఖతో మాట్లాడారు. ప్రస్తుతం పర్యాటకులు, సందర్శకులకు ఉచితంగా లోపలికి అనుమతిస్తున్నా అతి త్వరలో ఎంట్రీ ఫీజును నిర్ణయించనున్నారు. రోజూ వాహ్యాలికి వెళ్లిన వారు నెలకు రూ.50లు చెల్లించాలి, అదే పెళ్లిళ్లు, ప్రీవెడ్డింగ్ షూటింగులుకు, పిక్నిక్‌లకు వేరే రేటును నిర్ణయిస్తున్నట్టు సమాచారం. దీనికై బీఎన్ ప్యాలస్ మెయిన్ గేటు కీపర్, వాచ్‌మెన్‌లు ఆరుగుర్ని కలెక్టర్ నియమించారు. మూడేళ్ల కిందట బృందావన ప్యాలస్‌లో బాబుషాన్, దివ్య నటించిన ఒడియా చలన చిత్రం 'సుందర్‌ఘడ్ కా సల్మాన్‌ఖాన్' షూటింగు జరుపుకుని విజయవంతమైంది. ప్రస్తుతం ప్యాలస్‌లో పనులు వేగంగా జరుగుతున్నాయి.

శ్రీ మందిరం భద్రతా ఉప కమిటీ సమావేశం



భద్రతా ఉప కమిటీ సమావేశానికి హాజరైన సభ్యులు

- త్వరలో వాకీ టాకీ వ్యవస్థ– మొబైల్ ఫోన్లు పూర్తిగా నిషేధం



గిరీష్ చంద్ర ముర్ము

భువనేశ్వర్: పూరీ శ్రీ మందిరం భద్రతా వ్యవస్థ పటిష్టపరిచే దిశలో కదలిక ఆరంభమైంది. శ్రీ మందిరంలోనికి మొబైల్ ఫోన్లు పూర్తిగా నిషేధించాలని నిర్ణయించారు. భద్రత ఉప కమిటీ ప్రముఖుడు గిరీష్ చంద్ర ముర్ము అధ్యక్షతన నీలాద్రి భక్త నివాసంలో మంగళవారం ప్రత్యేక సమావేశం జరిగింది. పూరీ జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు సూపరింటెండెంట్, సీనియర్ అధికారులు, సేవాయతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో భక్తులకు సురక్షిత దర్శనం మరియు శ్రీ మందిరం భద్రతపై ప్రధానంగా చర్చించారు. శ్రీ మందిరంలో వాకీ టాకీ వ్యవస్థ అమలు అవుతుంది. శ్రీ మందిరంలో మొబైల్ ఫోన్లు పూర్తిగా నిషేధించబడతాయి. పోలీసులు, సేవా సిబ్బంది కూడా ఫోన్లు తీసుకెళ్లలేరని సమావేశం తర్వాత భద్రతా ఉప కమిటీ అధ్యక్షుడు గిరీష్ ముర్ము తెలిపారు. ఆలయ అంతర్గత మరియు బాహ్య భద్రతపై చర్చించినట్లు తెలియజేశారు. ఇతర దేవాలయాల భద్రత వ్యవస్థను పరిశీలించిన తర్వాత శ్రీ మందిరం భద్రత వ్యవస్థని పటిష్టపరిచేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

సెంచూరియన్ వర్సిటీ ఆధ్వర్యంలో థ్రాంబోసిస్ దినోత్సవం



రాణిపేట డీపీఓ కార్యాలయంలో ప్రపంచ థ్రాంబోసిస్ డే నిర్వహించిన సెంచూరియన్ వర్సిటీ బృందం



బరువు చూసుకుంటున్న ఎస్పీ జ్యోతింద్ర పండా

పర్లాకిమిడి: రాణిపేట గ్రామంలోని ఎస్పీ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ థ్రాంబోసిస్ దినోత్సవం సందర్భంగా సెంచూరియన్ వర్సిటీ నర్సింగ్ విద్యార్థులు ఆరోగ్య పరీక్ష శిబిరం నిర్వహించారు. కాళ్ల రక్తనాళాల్లో గడ్డ కట్టడాన్ని డీప్ వెయిన్ థ్రాంబోసిస్ అంటారు. కొన్నిసార్లు ఇది తీవ్రమైన సమస్యలకు దారి తీస్తుంది. దీని వల్ల గడ్డలు విరిగిపోయి ఊపిరితిత్తులు లేదా గుండె వంటి అవయవాలకు చేరవచ్చు అని వక్తలు అన్నారు. కార్యక్రమం ఎస్పీ జ్యోతింద్ర కుమార్ పండా, డీఎస్పీ అమితా పండా సహకారంతో జరిగింది. శిబిరంలో పోలీసు సిబ్బందికి థ్రాంబోసిస్ నివారణ కోసం కాలి వ్యాయామాల ప్రదర్శన నిర్వహించారు. 30 మంది పోలీసు సిబ్బందికి రక్తపోటు, బాడీ మస్ ఇంటెక్స్, ఎత్తు, బరువు వంటి పరీక్షలు కూడా నిర్వహించారు. సెంచూరియన్ వర్సిటీ రిజిస్ట్రార్ అనితా పాత్రో, డైరెక్టర్ (అడ్మిన్) డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి, డాక్టర్ ఎస్పీ నందా, నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి


పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నందిగాం: మండల పరిధిలోని కవిటి అగ్రహారం వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పలాస రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పలాస మార్చురీలో భద్రపరిచారు. మృతుడి వయసు 35 ఏళ్లు ఉంటుందని, ఎడమ చేతిపై ఇంగ్లిష్‌లో సుశాంత అని పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్పీ పోలీసులను సంప్రదించాలన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


రిమ్స్‌లో ధర్మారావు మృతదేహం

పాతపట్నం: గంగువాడ గ్రామానికి చెందిన రావలవలస ధర్మారావు(52) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.ఎస్‌ఐ కె.మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారావు ఈ నెల 12న మద్యం సేవించి ఇంటికి రావడంతో భార్య నిలదీసింది. దీంతో మనస్తాపం చెందిన ధర్మారావు పంట పొలాలకు కొట్టే పురుగుల మందును తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి


సజ్జల రామకృష్ణారెడ్డితో జిల్లాకు చెందిన పరిశీలకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో అనుబంధ విభాగాల నియామకం త్వరితగతిన చేపట్టాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని ఎమ్మెల్సీ, పాతపట్నం నియోజకవర్గ పరిశీలకుడు పాలవలస విక్రాంత్, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల పరిశీలకుడు కరిమి రాజేశ్వరరావు, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిశీలకుడు దుంపల లక్ష్మణరావు, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల పరిశీలకుడు శాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. తాడేపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో నాయకులను, పార్టీ కార్యకర్తల్ని సమన్వయపరచాలని కోరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ సేవలను ప్రజల గుమ్మం దాకా చేరవేయడమే తమ ప్రధాన ధ్యేయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్‌డీసీ, కేఆర్‌ఆర్‌సీ, పీజీఆర్ఎస్ వంటి రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులు, కోర్టు కేసులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ నెల 18లోగా ఈ పంట వివరాల నమోదు ప్రక్రియ నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో లక్ష్యాన్ని చేరుకున్న లావేరు మండల బృందాన్ని అభినందించారు. ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన కింద 11 గ్రామాలు ఎంపికయ్యాయని వాటిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసిన వాహనాల గురించి ఆరా తీశారు. వారం లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిమాండ్ ఉన్న చోట్ల ప్రారంభించేందుకు ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ చెప్పారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నందిగాం: నర్సిపురం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి చెందింది. ఆదివారం రాత్రి ఆగి ఉన్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో తొమ్మిది మంది గాయాలపాలయ్యారు. వీరిని 108 వాహనం, నేషనల్ హైవే అంబులెన్స్‌లలో టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అందులో ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పిట్ట రాధమ్మ(60) మంగళవారం మృతి చెందింది. ఈమె స్వస్థలం ఇచ్ఛాపురం మండలం ధర్మపురం. ఒడిశా రాష్ట్రం రాయగడలో మజ్జి గౌరమ్మని దర్శనం చేసుకొని తిరిగి గ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

'ఎదుగుదల ఓర్వలేకే నిందలు'

ఇచ్ఛాపురం: రాజకీయంగా తన ఎదుగుదల చూడలేకే కొంతమంది కూటమి నేతల సహకారంతో వ్యక్తిగతంగా నిందారోపణలు చేస్తున్నారని ఇచ్ఛాపురం జనసేనపార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు అన్నారు. మంగళవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనకు, మామయ్యకు మధ్య పెనుగులాట మాత్రమే జరిగిందని, తాను ఎవరిపైనా దాడిచేయలేదని స్పష్టం చేశారు.

నష్టపరిహారం చెల్లించాలని రాస్తారోకో


ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఐఐసీ సునీత బెహరా తదితరులు


బైకు అడ్డుగా పెట్టి రాస్తారోకో చేసిన ఆందోళనకారులు

రాయగడ: జిల్లాలోని రామనగుడ సమితి పాలుపాయి వద్ద సోమవారం నాడు ట్యాంకర్, బైకు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన ఇద్దరు యువకుల కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు రామనగుడ ప్రధాన రహదారి వద్ద మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. దీంతో రాయగడ, గుణుపూర్, బరంపురం ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న రామనగుడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో చర్చించారు. వారు అంగీకరించకపోవడంతో గుణుపూర్ ఎస్‌డీపీఓ బబులా నాయక్, బీడీఓ ప్రద్యుమ్న మండల్, తహసీల్దార్ ప్రాణకృష్ణ పాణిగ్రహి, ఐఐసీ సునీత బెహర తదితరులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిగించేందుకు ప్రయత్నించారు. కానీ సుమారు నాలుగు గంటల సమయం వరకు పరిస్థితి అదుపులోకి రాలేదు. అనంతరం బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో పరిస్థితి కుదుటపడింది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతుల అందజేస్తున్న అతిథులు

జయపురం: జయపురం సమితి స్థాయి శిశు మహోత్సవం సురభి–2025 కార్యక్రమం స్థానిక జయనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని హెచ్‌ఎం మీనతి పట్నాయక్, ప్రారంభించారు. జయనగర్ ఎస్.ఎస్ ప్రభుత్వ పాఠశాల, సునారి సాహి ఉన్నత పాఠశాల విద్యార్థులు సంగీతం, నృత్యంతో అలరించారు. సీఆర్‌సీసీ విజయలక్ష్మీ స్వైన్ పర్యవేక్షణలో ప్రథమ శ్రేణి నుంచి పదో శ్రేణి విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, చిత్ర లేఖన, నృత్య, సంగీత, హస్తాక్షర, క్విజ్, తదితర పోటీలను సీనియర్, జూనియర్ విభాగల్లో నిర్వహించారు. సీనియర్లు, జూనియర్లకు 26 పోటీలు నిర్వహించగా 180 మంది పాల్గొన్నారు. ఉత్తమ విజేతలుగా 25 మంది ఎంపికయ్యారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జయపురం బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి చందన కుమార్ నాయక్, అదనపు విద్యాధికారి కె.గోపాల్, బీఈఓ కార్యాలయ సెక్షన్ అధికారి శశిభూషణ దాస్, జయపురం ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు దేవీ ప్రసాద్ దాస్, సీఆర్‌సీసీ రుద్ర ప్రసాద్ పాణిగ్రహి, రామేశ్వర పండా పాల్గొన్నారు.

యువకుడి ఔదార్యం


పోగొట్టుకున్న బంగారాన్ని తిరిగి ఇచ్చిన పోలీసులు

రాయగడ: రోడ్డుపై తనకు దొరికిన 11 గ్రాముల బంగారాన్ని పోలీసు అధికారి సమక్షంలో బంగారం పోగొట్టుకున్న వ్యక్తికి ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు ఒక యువకుడు. స్థానిక రింగ్ రోడ్డు సమీపంలో గల మంగళా మందిరం వద్ద నివసిస్తున్న ఎం.రమేష్ అనే యువకుడు రహదారిలో నడుస్తున్న సమయంలో బంగారం దొరికింది. దీంతో అతడు సరాసరి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తనకు దొరికిన బంగారం గురించి చెప్పాడు. ఇదిలాఉండగా గత ఆదివారం నాడు సుమంత్ మహారాణ అనే పాత్రికేయుడు తాను ఖరీదు చేసిన 11 గ్రాముల బంగారం ఇంటికి తీసుకువస్తుండగా ఎక్కడో పడిపోయిందని ఫిర్యాదు చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ఐఐసీ ప్రసన్న కుమార్ బెహరా అన్ని ఆధారాలు పరిశీలించిన మీదట బంగారం పోగొట్టుకున్న సుమంత్‌ని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మంగళవారం రమేష్ సమక్షంలో బంగారాన్ని తిరిగి ఇచ్చారు. ఈ సందర్భంగా రమేష్‌ను పోలీసులు అభినందించారు.

చిత్రకూట్ జలపాతం సందర్శన


చిత్రకూట్ జలపాతం వద్ద కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా

కొరాపుట్: ఇండియా నయాగార జలపాతంగా పేరుపొందిన చిత్ర కూట్ జలపాతాన్ని కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్కా సందర్శించారు. మంగళ వారం సమీప ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బస్తర్ ప్రాంతంలో ఉన్న చిత్రకూట్ జలపాతాల అందాలను తిలకించారు. తాను గతంలో విన్నట్లు ఇది ఇండియా నయాగరా జలపాతమని అభివర్ణించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిశీలన కోసం ఏఐసీసీ ఆదేశంతో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో బస్తర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కుంకుమ పూజలు


గజలక్ష్మీ దేవికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జయపురం: స్థానిక రాజనగర్ కూడలి వద్ద గజలక్ష్మీ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం గజలక్ష్మీ దేవికి కుంకుమార్చనలు నిర్వహించారు. వేద పండితులు కృష్ణచంద్ర దాస్ మహిళలతో పూజలు జరిపించారు. పూజా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొట్లాట ఘటనలో జరిమానా

వజ్రపుకొత్తూరు రూరల్: ఒంకులూరు గ్రామంలో 2016లో ఇరు వర్గాల మధ్య జరిగిన కొట్లాట ఘటనపై అదే గ్రామానికి చెందిన బడే సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై పలాస సివిల్ జ్యుడీషియల్ కోర్టులో వాదప్రతివాదనలు జరిగాయి. ఈ మేరకు ముద్దాయిలైన దాసరి ధనలక్ష్మీ, సండుపల్లి సావిత్రిలకు రూ.1000 జరిమానా విధించింది. జరిమాన కట్టకపోతే 3 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు కోర్టు తీర్పు విధించింది. ప్రధాన నిందుతుడు దాసరి ప్రదీప్‌పై తీర్పు పెండింగ్‌లో ఉన్నట్లు ఎస్సై బి.నీహర్ తెలిపారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి


వినతిపత్రం అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ సునీత, కౌన్సిలర్లు

జయపురం: స్థానిక మహాత్మా గాంధీ రోడ్డు(ఎం.జి.రోడ్డు) పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని జయపురం మునిసిపాలిటీ కౌన్సిలర్లు జయపురం రోడ్డు భవన విభాగ సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రియదర్శి బెహరాను మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు. మునిసిపాలిటీ ఉపాధ్యక్షురాలు బి.సునీత నేతృత్వంలో బీజేడీ కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో ప్రధాన మార్గంలో ఒకటైన ఎం.జి రోడ్డు పునరుద్ధరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది నవరంబర్ 14వ తేదీన అధికారుల నిర్ణయం మేరకు మునిసిపాలిటీ 40 అడుగుల రోడ్డు ఏర్పాటు కోసం రెండు వైపులా ఆక్రమణలను తొలగించటం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం ఆర్‌అండ్‌బీ విభాగం టెండర్ పిలిచి కంట్రాక్టర్‌కు పనులు ఇచ్చిందన్నారు. డ్రైన్ పనులు చేపట్టారని, ఇంత వరకు 90 శాతం డ్రైన్ పనులు పూర్తయ్యాయన్నారు. రోడ్డు పనులు నేటికీ చేపట్టలేదని, రోడ్డు మధ్యన ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించలేదన్నారు. డ్రైన్ పనులు పూర్తికాకపోవటం వలన రోడ్డుపైనే నీరు ప్రవహిస్తోందన్నారు.విద్యుత్ స్తంభాల నుంచి లైట్లు తీసివేయటం వలన వెల్‌కమ్ జంక్షన్ నుంచి కమళా మెడికల్ వరకు అంధకారంగా ఉందన్నారు. వెంటనే రోడ్డు పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు బి.విష్ణువర్ధన్ రెడ్డి, జస్‌పాల్ సింగ్, శశిరేఖ పారజ, తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు.. నేను సైతం

- నేషనల్ యూత్ వలంటీర్లగా పనిచేసేందుకు ఆహ్వానం
- ఎంపికైతే పారితోషికం
- దరఖాస్తులకు నేడే ఆఖరు తేది



శ్రీకాకుళం న్యూకాలనీ: సమాజంలో కోసం ఏదైనా మంచి పని చేయాలని ఉందా ? సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే ఆసక్తి ఉందా ? అయితే కేంద్ర ప్రభుత్వం మీకు చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది. నేషనల్ యూత్ వలంటీర్‌గా సమాజ సేవ చేసేందుకు ఆసక్తి గల యువత నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఒకవైపు సేవ చేస్తూనే మరోవైపు ప్రతినెలా పారితోషికాన్ని పొందవచ్చు. అక్టోబర్ 15లోగా 'ఎన్‌వైకెఎస్.ఎన్ఐసీ.ఇన్' వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఎంపిక విధానం ఇలా..

దరఖాస్తుదారులకు శ్రీకాకుళం జిల్లాలోని మేరా యువభారత్ (నెహ్రూ యువకేంద్రం) కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుంది. అభ్యర్థుల వయస్సు అక్టోబర్ ఒకటి నాటికి 18 నుంచి 29 ఏళ్ల మధ్య ఉండాలి. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత కలిగినవారు అర్హులు. డిగ్రీ అర్హతను కలిగి కంప్యూటర్ అప్లికేషన్స్, ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు, ఈ–బ్యాంకింగ్, డిజిటల్ వంటి వివిధ యాప్‌లలో సాంకేతిక పరిజ్ఞానం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు. మై భారత్ అనుబంధ యువజన సంఘాల సభ్యులు, మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని అధికారులు చెబుతున్నారు. వివరాలకు 08942–222028, 9133095646 నంబర్లను సంప్రదించవచ్చు.

ఎంపికైతే స్టైఫండ్ ఇలా..

వలంటీరుగా ఎంపికైనవారు ఏడాది కాలం పనిచేయాల్సి ఉంటుంది. ఎంపికైనవారికి నెలకు రూ.5వేల స్టైఫండ్ చెల్లిస్తారు.

విధులు ఇలా..

వలంటీర్లకు ప్రత్యేకంగా బ్లాకులను కేటాయిస్తారు. రెండు మండలాలను కలిపి ఒక బ్లాక్‌గా గుర్తిస్తారు. వలంటీర్లు యువజన, మహిళా సంఘాలను స్థాపించడం, సంఘాలను సమన్వయం చేసుకుని క్రీడలు, ఆరోగ్యం, అక్షరాస్యత, పారిశుద్ధ్యం, పచ్చదనం–పరిశుభ్రత, మహిళా సాధికారిత, లింగవివక్ష, ఇతర సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యపరచడం, తదితర అంశాలో ప్రగతి సాధన కోసం పనిచేయాల్సి ఉంటుంది.

సువర్ణావకాశం



సమాజ సేవ చేయాలన్న ఆసక్తి కలిగినవారు మాత్రమే దరఖాస్తులు చేయండి. ఎంపికైనవారు తమకు అప్పగించిన బ్లాకుల్లో సామాజిక, చైతన్య కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. బుధవారం సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలి.

– కె.వెంకట్ ఉజ్వల్, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాకుళం


దారి పొడవునా స్తంభించిన వాహనాలు

క్యాపిటల్ థాణా ముట్టడి


క్యాపిటల్ థాణా ముట్టడించిన ఆటో డ్రైవర్ల సంఘం ప్రతినిధులు

భువనేశ్వర్: స్మార్ట్ సిటీ ఆన్‌లైన్ ఆటో డ్రైవర్ల సంఘం మంగళ వారం క్యాపిటల్ థాణాను చుట్టుముట్టింది. థాణా ముందు ఆటోలు దారి పొడవునా బారులు తీరాయి. రాజ్‌మహల్ కూడలి నుంచి ఏజీ చౌక్ వరకు రవాణా స్తంభించిపోయింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొన్ని రోజుల కిందట ఆన్‌లైన్ స్మార్ట్ సిటీ ఆటో డ్రైవర్ల సంఘం సభ్యుడిని స్టేషన్ ఆటో డ్రైవర్ల సంఘం నుంచి కొంత మంది సభ్యులు కొట్టినట్లు ఆరోపణ. ఈ ఆరోపణ కింద సోమవారం క్యాపిటల్ థాణా పోలీసులు ఇరు వర్గాల సభ్యులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు దోషులను అరెస్టు చేయకుండా అమాయకులను అరెస్టు చేశారని ఆన్‌లైన్ స్మార్ట్ సిటీ ఆటో డ్రైవర్ల సంఘం మంగళవారం విజృంభించి థాణా ముట్టడికి పాల్పడ్డారు.

మూఢ నమ్మకాలతో అరాచకాలు సృష్టిస్తే చర్యలు


గ్రామ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కొరాపుట్: మూఢ నమ్మకాలతో సమాజంలో సాటి వ్యక్తులను హింసిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పాడువా పోలీసులు ప్రకటించారు. మంగళవారం కొరాపుట్ జిల్లా నందపూర్ సమితి పాడువా పోలీస్ స్టేషన్ పరిధిలో పంతుంగ్ గ్రామ పంచాయతీ మారిపుట్ గ్రామ ప్రజలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ గ్రామంలో లక్ష్మణ్ కిలో కుటుంబం చేతబడి చేస్తుందనే నెపంతో అతని సోదరుని కుమారులు దాడులు చేశారు. లక్ష్మణ్ ఇంటిపై దాడి చేసి పెంపుడు జంతువులైన కుక్కలు, మేకలు, కోళ్లను హింసించి చంపారు. ఆ ఇంట్లో ఉన్న పసి పిల్లలతో సహా 14 మందిని కొట్టి గ్రామం నుంచి వెలివేశారు. బాధితులు సమీప గ్రామంలో తల దాచుకున్నారు. ఈ ఘటనపై ఐఐసీ ఆశోక్ బిశోయి గ్రామస్తులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇటువంటి ఘటనలను చూస్తూ ఊరుకోబోమన్నారు. ఇతర శాఖల సిబ్బందితో కలిసి నిందితులను అరెస్ట్ చేసి స్టేషన్‌కి తరలించారు. అనంతరం బాధిత కుటుంబానికి గట్టి భద్రత మీద తిరిగి వారి స్వగృహాలకు తెచ్చి వదలిపెట్టారు. గ్రామస్తులతో భవిష్యత్‌లో ఇటువంటి పనులకు పాల్పడబోమని ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గ్రామ ప్రజలకు అంధ విశ్వాసాలకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

'కిరణ్'తో అక్షర జ్ఞానం


కిరణ పాఠశాలలో చదువుతున్న చిన్నారులు

జయపురం: ఆదివాసీ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్ష్యరాస్యత ఎక్కువగా ఉంది. బడి మెట్లు ఎక్కని పిల్లలు ఎంతో మంది ఉన్నారు. పశువులు కాయటం, అటవీ ఉత్పత్తులు సేకరణలో జీవితాలను గడుపటం పరిపాటి. అటువంటి పిల్లలకు అక్షర జ్ఞానం కల్పించేందుకు గోపబంధు సేవా పరిషత్ అనే స్వచ్ఛంద సంస్థ నడుం బిగించింది. ఆదివాసీలలో నిరక్ష్యరాస్యతను రూపుమాపేందుకు ఆ సంస్థ ఉద్యమిస్తోంది. జిల్లాలో అక్షరాస్యతలో అట్టడుగున ఉన్న జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితిలో గోపబంధు సేవా పరిషత్ 'కిరణ్' పేరుతో చేపట్టిన కార్యక్రమంలో ఆ సంస్థ కార్యకర్తలు మారుమూల ప్రాంతాల్లోని పిల్లలకు, డ్రాపౌట్ విద్యార్థులకు చదువు చెబుతున్నారు. ఆ సమితిలో డుమునిజోల, గౌయల్‌జొడి, చిలిమల, పాటైపాదర్, సిలిమాల గ్రామాల్లోని 15 ఏళ్ల లోపు పిల్లలకు చదువు చెప్పే కార్యక్రమం చేపట్టారు. ఇంతవరకు 120 మంది పిల్లలకు చదువు చెబుతున్నామని గోపబంధు సేవా పరిషత్ సభ్యులు తెలిపారు. కోటపాడ పంచాయతీ డుమునిజొల, చంచల ఖొర, ఉరదబ ఖొర, గౌయల్‌జొడి, దొయితారి ఖిలో గ్రామాల్లో చదువు కునేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. గోపబంధు సేవా పరిషత్ అధ్యక్షుడు ప్రదీప్ మహరణ మాట్లాడుతూ ఆదివాసీ మారుమూల గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన లేదని, పిల్లల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హాస్టల్ సౌకర్యం గురించి వారికి తెలియదన్నారు. మారుమూల దుర్గమ ప్రాంతాల్లో పాఠశాలలు లేకపోవటం వలన చిన్న పిల్లలు చదువుకునే అవకాశాలు లేవని, అందువల్ల కిరణ్ పాఠశాల ద్వారా అటువంటివారికి ఉత్తమ భవిష్యత్‌ను కల్పించేందుకు తాము నడుంబిగించామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గుంజీ అనుస్థాన్, దీపబంధు ఫౌండేషన్‌లు సహకరిస్తున్నాయన్నారు. పిల్లలకు ఉచిత విద్యాబోధనతో పాటు పాఠ్య పుస్తకాలు, అవసరమైన పరికరాలు సమకూర్చుతున్నట్లు వెల్లడించారు. విద్యాధికారానికి దూరం అయిన పిల్లలకు విద్యాధికారం కల్పిస్తున్న గోపబంధు సేవా పరిషత్ వారి కిరణ్ కార్యక్రమం ప్రశంసనీయమని జిల్లా పరిషత్ సభ్యులు రాజేష్ మహురియ అన్నారు.

భరతజాతి ముద్దుబిడ్డ అంబేడ్కర్


పాలవలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: భరతజాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ, రాజ్యాంగా సృష్టికర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సీతారాం అన్నారు. పాలవలసలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అనంతరం దంతపురి బౌద్ధక్షేత్రంలో 69వ దమ్మదీక్ష దినోత్సవ బౌద్ధ సమ్మేళనంలో స్పీకర్ పాల్గొన్నారు. బుద్ధుడి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియన్ మిషన్ రాష్ట్ర అధ్యక్ష ఉపాధ్యక్షులు కంఠ వేణు, తైక్వాండో శ్రీను, పీఎస్ఎన్ మూర్తి, కె.కె.రాజా, బుద్ధిస్ట్ సొసైటీ అధ్యక్షుడు హరిబాబు, సామాజిక పోరాట సమితి అధ్యక్షుడు కల్లేపల్లి రాంగోపాల్, గొల్లపల్లి సురేష్, యడ్ల ఈశ్వరరావు, అదపాక గౌరినాయుడు, ఇల్లాకుల సూర్యప్రకాశరావు, కొంచాడ సూర్యానారాయణ,గొల్లపల్లి నందేష్., బొత్స వెంకటరమణ పాల్గొన్నారు.

మెరుపుల సమయంలో గ్రానైట్ బ్లాస్టింగ్‌లు వద్దు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో గ్రానైట్ బ్లాస్టింగ్ చేయకూడదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చెప్పారు. గ్రానైట్ యాజమాన్యాలతో మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రానైట్ ఇండస్ట్రీలో భద్రత, రక్షణ ముఖ్యమన్నారు. కార్మికుల భవిష్యత్‌కు భరోసాగా గ్రూపు ఇన్సూరెన్సు ఉండాలన్నారు. బ్లాస్టింగ్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలన్నారు. గ్రానైట్ ఇండస్ట్రీస్‌పై ట్రైనింగ్ సెంటర్‌కు భూమి కేటాయిస్తానన్నారు. ఈఎస్ఐలో ఉంటే అంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కలెక్టర్‌కు వివరించారు. ఈఎస్ఐ పెట్టుకునేందుకు డిసెంబర్ 31 వరకు సమయం ఉన్నట్టు చెప్పారు. గ్రానైట్ కార్మికుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు 10 సెంట్లు భూమి కావాలని గ్రానైట్ అసోసియేషన్ కోరగా భూమి ఇవ్వాలని టెక్కలి ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. లైసెన్సులు లేని క్రషర్స్ ఉంటే ఆపివేయాలన్నారు. వాతావరణ కేంద్రం జారీ చేసిన వాతావరణ పరిస్థితుల ఆధారంగా తక్షణమే సైరన్ వేయాలని చెప్పారు. భూ గర్భ గనుల శాఖ ఉప సంచాలకులు మోహనరావు మాట్లాడుతూ గ్రానైట్ కార్మికులకు కార్మిక శాఖ బీమా కల్పించాలని, అన్ని అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. లైసెన్సు ఉన్న వారితోనే బ్లాస్టింగ్ చేయించాలన్నారు.

క్లుప్తంగా

ఆడపిల్లల పట్ల వివక్ష కూడదు

• డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లల పట్ల వివక్ష చూపకూడదని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. జీవన రాణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి మంగళ వారం సాయంత్రం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్ల అయినా, మగ పిల్ల వాడు అయినా ఇద్దరినీ సమానంగా చూడాల న్నారు. ఆడపిల్లలు కూడా పురుషులతో సమా నంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఎన్సీడీ పీఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డెమో చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలకు ఎం పికైనట్లు హెచ్ఎం వి.వెంకటరావు తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకు శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన క్రీడల్లో పరు గుపందెలో అండర్ 19 విభాగంలో కె.దిలీప్‌కు మార్, జి.సంతోష్, ఎం.అరుణ్‌కుమార్, జి.జ్యోత్స్న, పి.కుసుమ, ఎస్.కల్పన, ఎ.జానీ ్నలు, ఖో-ఖో క్రీడలో పి.లిఖిత్, అండర్ 17 బేస్‌బాల్ విభాగంలో కె.రాజేంద్ర మంచి ప్రతిభ చూపించి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. వారిని మంగళవారం పాఠశాలలో హెచ్ ఆధ్వర్యంలో మంగళవారం అభినందిం చారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ కె.సూర్య నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య



సంతోష్ మృతదేహం

సంతకవిటి: మండలంలోని బిల్లాణి గ్రామానికి చెందిన కరణం సంతోష్(28) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై మృ తుడి తండ్రి నారాయణరావు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ఎం.వాసుదేవ రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సం తోష్‌కు ఓ చెల్లి ఉంది. ఆమెకు కుటుంబసభ్యు లు ఇటీవల పెళ్లి సంబంధం చూశారు. ఈ సంబంధం కుటుంబానికి నచ్చింది. సంతోష్‌కు ఈ సంబంధం నచ్చకపోవడంతో సోమవారం పొలంలో గడ్డి మందు తాగేయగా కుటుంబస భ్యులు గమనించి చికిత్స నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి తీసుకు వెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బంగారు నగల దోపిడీ

పాచిపెంట: మండలంలోని సారాయి వలస ఏకలవ్య పాఠశాల మహిళా ఉపాధ్యాయు రాలికి చెందిన బంగారు నగలను ఇద్దరు దుం డగులు దోపిడీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏకలవ్య పాఠశాలలో మ్యూజికల్ టీచర్‌గా పనిచేస్తున్న శతిభజన్త్రి(ఢి ల్లీ) ఆదివారం రాత్రి ఎనిమిది గంటల సమ యంలో స్టడీ అవర్ ముగించుకుని సాలూరు లో తాను అద్దెకు ఉంటున్న నివాసానికి కారుపై వెళ్తుండగా మోసూరు జంక్షన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు దుండగులు వచ్చి కారును ఆపి ఉపాధ్యాయురాలి మెడలో ఉన్న నగను, చేతికి ఉన్న బంగారు గాజులు అపహ రించుకు పోయారు. ఈ విషయంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయ గా సాలూరు రూరల్ సీఐ రామకష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కృపారావు మంగళవారం తెలిపారు.

చంద్రబాబు చేసింది శూన్యం

• రూ.1.19 వేల కోట్లతో డిజైన్‌చేసిన అమరావతి ఎక్కడుంది?
• 2014లో మంజూరైన ఎయిమ్స్ కళాశాల పరిస్థితి ఏంటి?
• ఉచిత వైద్యం అందేవరకు పోరాటం చేద్దాం
• వైద్యకళాశాలల ప్రైవేటీకరణ దారుణం
• కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేద్దాం
• శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ



పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ



విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

చీపురుపల్లి(గరివిడి): రాష్ట్ర భవిష్యత్, ప్రజల ప్రయోజనాల కోసం సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా కొనసాగిన చంద్రబాబునాయుడు చేసింది శూన్యమని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్య నారాయణ విమర్శించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆలోచన చేసినది దివంగత మహా నేత వైఎస్సార్ తరువాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. గరివిడిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ చీపురుపల్లి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మించాలని, పేదలకు మెరుగైన వైద్యం, పేదలకు వైద్యవిద్య అందుబాటు లోకి రావాలని 2017లో అప్పటి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అయితే అప్పటికే ఎన్డీఏ కూటమిలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు కనీసం పట్టించుకోలేదన్నారు. 2019లో ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రెండేళ్ల పాటు కరోనా మహమ్మారి సవాల్ విసిరింద న్నారు. అయినప్పటికీ కరోనా బారి నుంచి ప్రజ లను రక్షించి, మరణాలు రేటు తగ్గించడంలో జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన దోహదం చేసిందన్నారు. ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా 17 వైద్య కళాశాలల మంజూరుకు కృషిచేశారన్నారు. కేవలం మూడేళ్ల లోనే 5 కళాశాలల నిర్మాణాలు పూర్తిచేశారన్నారు. వీటి కోసం రూ.8 వేల కోట్లు అవసరం కాగా రూ.2,200 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. కేవలం మూడేళ్ల కాలంలో 17 వైద్య కళాశాలలు మంజూరు చేయడం సాధ్యమైతే 2014లో విభజన సమయం లో రాష్ట్రానికి మంజూరైన ఎయిమ్స్ కళాశాల ఇంత వరకు ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. 2014లో రూ.1.19 వేల కోట్లతో డిజైన్ చేసిన అమ రావతి 2019 వరకు ఎంత మేర పనులు జరి గాయని ప్రశ్నించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 19 నెలలు కాలంలో రూ.2 లక్షలు కోట్లు అప్పులు తెచ్చి రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్యం అందేవరకు పోరాటం చేద్దాం

కూటమి ప్రభుత్వం చేపడుతున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద కుటుంబాల విద్యార్థులు వైద్య విద్యకు, సామాన్య ప్రజలు వైద్యానికి దూరమవుతా రని, దీనిని ప్రజావ్యతిరేక కార్యక్రమంగానే పరిగణిం చి పోరుబాట సాగిద్దామని శాసనమండలి విక్షనేత బొత్స సత్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపుని చ్చారు. వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేద్దామ న్నారు. సంతకాల సేకరణను వేగవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజా సంక్షేమం కానరావడంలే దన్నారు. ఇటీవల గుర్ల మండలం జమ్ము గ్రామంలో జరిగిన సంఘటన అత్యంత దారుణమని, భవిష్య త్తులో ఫలితం అనుభవిస్తారన్నారు.

☛ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అనేది ప్రజావ్యతిరేక నిర్ణయమని, విద్య, వైద్యం అనేది ప్రజల హక్కు అని అన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేలా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టేలా జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశార న్నారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి కళాశాలల ప్రాముఖ్యతను వివరించి సంతకాలు సేకరించాల న్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో విద్య, వైద్యం, వ్యవసాయం పూర్తిగా నిర్వీర్యం అవు తున్నాయన్నారు. ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోవడం తో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ తప్పులను సోషల్‌మీడియా వేది కగా ఎండగట్టాలన్నారు. కోటి సంతకాల సేకరణ తరువాత ఈనెల 28న నియోజకవర్గ స్థాయిలో పెద్దస్థాయిలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

☛ మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి హయాం లోనే విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం లభించిం దన్నారు. ఆరోగ్యశ్రీ నుంచి 108, 104, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో ఎన్నో వైద్యసేవలు, విజయనగరంలో మెడికల్ కళాశాల అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. వైద్యకళాశాలలను ప్రైవేటీకరిస్తూ కూటమి చేపట్టిన దుర్మార్గ పాలనను ప్రజలకు వివ రించి కోటి సంతకాలు సేకరించాలన్నారు. కార్యక్ర మంలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, మీసాల విశ్వేశ్వరరావు, వాకాడ శ్రీనివాసరావు, శీర అప్పలనాయుడు, పొట్నూరు సన్యాసినాయుడు, ఎస్.వి.రమణరాజు, కోట్ల విశ్వే శ్వరరావు, తాడ్డి వేణు, నాలుగు మండలాల సర్పం చులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

సుజుకి నూతన షోరూం ప్రారంభం



రింగ్ రోడ్డులో వేణుగోపాల్ సుజుకి రెండో శాఖను ప్రారంభించిన అభిషేక్ ఠాకూర్

విజయనగరం గంటస్తంభం: విజయనగరం పట్టణంలోని రింగ్ రోడ్డులో వేణుగోపాల్ సుజుకి సంస్థ తమ రెండవ షోరూమ్‌ను ప్రారం భించింది. మంగళవారం ఈ కొత్త శాఖను సుజుకి మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నేషనల్ హెడ్ అభిషేక్ ఠాకూర్ ఘనం గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుజుకి సంస్థ దేశవ్యాప్తంగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిందని, ఉత్త మమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. వేణుగోపాల్ సుజుకి సంస్థ విజయన గరంలో ఇప్పటికే ఒక శాఖను విజయవంతంగా నిర్వహిస్తోందని, వినియోగదారుల మద్దతుతో రెండో షోరూం ప్రారంభించడం ఆనందకరమ న్నారు. కార్యక్రమంలో బెస్ట్ వాల్యూ ఎస్ఎంబీపీ ఎల్ ఆపరేషన్స్ హెడ్ వీఎస్.యాస్ పాల్, వేణు గోపాల్ సుజుకి ఎండి జి.అభిరామ్, జీఎం సీహె చ్.ప్రవీణ్ కుమార్, సర్వీస్ మేనేజర్ సంతోష్ వర్మ, ఏరియా సేల్స్ మేనేజర్ ఎస్.సురేంద్ర, ఏరియా సర్వీస్ మేనేజర్ వి.సాయి కౌటిన్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు పుర్రె



ఇంటి ముందు బొట్లు పెట్టి ఉన్న మనిషి పుర్రె

డెంకాడ: మండలంలోని పెదతాడివాడ పం చాయతీ పరిధి ఊడికిలపేట గ్రామంలోని పి.పై డమ్మ ఇంటి ముందు కుంకుమ, పసుపు రాసిన పుర్రెను గుర్తు తెలియని దుండగులు పెట్టారు. ఆల స్యంగా వెలుగు చూసిన ఈ సంఘటనకు సంబధిం చిన వివరాలిలా ఉన్నాయి. ఎప్పటిలాగానే ఆదివారం రాత్రి పి.పైడమ్మ, కుటుంబసభ్యులు ఇం టిలో నిద్రించారు. సోమవారం తెల్లవారుజామున నిద్రలేచి ఇంటిలో నుంచి బయటకు వస్తుండగా ఇంటి ముందు మనిషి పుర్రె పెట్టి, దాని చుట్టూ కుం కుమ,పసుపు చల్లి ఉండడాన్ని గమనించిన వారు భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ సంఘ టనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై ఎ.సన్యాసినాయుడు తెలిపారు.

నరక యాతన పడి వ్యాన్ డ్రైవర్ మృతి

• మృతుడు తాడేపల్లి గూడెం వాసి



ఐషర్ వ్యాన్ బాడీకి, రేడియేటర్‌కు మధ్యలో ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజు



డ్రైవర్ రాజును బయటకు తీస్తున్న స్థానికులు

వీరఘట్టం: ఐషర్ వ్యాన్‌లో ఉన్న గోనె సంచులను అన్‌లోడ్ చేసేందుకు వ్యాన్‌కు ఉన్న తాళ్లను విప్పుతూ ప్రమాదవశాత్తు వ్యాన్ బాడీకి-క్యాబిన్‌కు మధ్యలో పడిపోయిన డ్రైవర్ రాజు (35) వీర ఘట్టం మెయిన్ రోడ్డులో మంగళవారం మృతి చెం దాడు. ఈ ప్రమాదంపై ఎస్సై జి.కళాధర్‌తో పాటు స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గోనె సంచుల వ్యాపారికి విజయవాడ నుంచి ఐషర్ వ్యాన్‌తో తాడేపల్లి గూడెంకు చెందిన రాజు అనే డ్రైవర్ గోనె సంచులను తీసుకువచ్చాడు. వ్యాన్‌లో ఉన్న గోనె సంచులను అన్‌లోడ్ చేసేందుకు గాను కలాసీలు రావడంతో వ్యాన్‌కు ఉన్న కట్లు విప్పేం దుకు డ్రైవర్ రాజు వ్యాన్ పైకి ఎక్కాడు.ఆ తాళ్లు విప్పుతూ ప్రమాదవశాత్తు వ్యాన్ బాడీకి-క్యాబిన్‌కు మధ్యలో ఉన్న సందులో పడిపోయాడు. ఈ ప్రమా దంలో డ్రైవర్ రాజు తలకిందులుగా వ్యాన్ బాడీకి రేడియేటర్‌కు మధ్యలో ఉండిపోయి నరకయాతన అనుభవించాడు. ఈ ప్రమాదాన్ని చూసిన కలాసీలు, స్థానికులు వెంటనే అతన్ని బయటకు తీసే ప్రయత్నం చేశారు. పక్కనే ఉన్న కొందరు మోటార్ వర్కర్లు కూడా వచ్చి వ్యాన్‌కు ఉన్న కొన్ని పరికరాలను కోసేసి డ్రైవర్ రాజును బయటకు తీయగా కొన్ని గాయాలతో బయట పడ్డాడు. మెల్ల గా బయటకు వచ్చి కూర్చున్న డ్రైవర్‌కు కొద్ది క్షణాల్లోనే ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కుప్పకూలిపో యాడు. స్థానికులు సపర్యలు చేసి పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా వైద్యసిబ్బంది తనిఖీ చేసి చనిపోయి నట్లు నిర్ధారించారు. ఈ ప్రమాదంపై ఎస్సై జి.క ళాధర్ కేసు నమోదు చేశారు. వీరఘట్టం పీహెచ్ సీలో ఉన్న డ్రైవర్ మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి భద్రపరిచారు. మృ తుడి కుటుంబసభ్యులకు సమాచారం తెలియజే శామని, వారు వచ్చిన తర్వాత స్టేట్‌మెంట్లు రికార్డు చేసి పోస్టుమార్టం అనంతరం బాడీని అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.

గిలగిలాకొట్టుకోవడంతో కంట తడి

చుట్టూ వందలాది జనం..రోడ్డు పక్కనే ఉన్న వ్యాన్ వద్ద గిలగిలా కొట్టుకుంటూ డ్రైవర్ రాజు చేసిన ఆర్త నాదాలు స్థానికులను కంటతడి పెట్టించాయి. వ్యాన్ బాడీకి-క్యాబిన్‌కు మధ్య సుమారు 40 నిమిషాల పాటు ఇరుక్కుపోయిన డ్రైవర్ రాజు మృ త్యువుతో పోరాడి బయటపడ్డాడని అందరూ అను కున్నారు. హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నా రు.అయితే బయటకు వచ్చిన క్షణాల్లోనే డ్రైవర్ చనిపోయాడని తెలియడంతో అక్కడ ఉన్నవారం తా తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంటనే ఈ ప్రమాద విషయాన్ని వ్యాన్ యజమానికి ఫోన్‌లో తెలియజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన రాజు అనే డ్రైవర్ విజయవాడ నుంచి ఈ వ్యాన్ ఇక్కడికి తీసుకువచ్చినట్లు వ్యాన్ యజమాని పోలీసులకు తెలిపారు.ఈ విషయాన్ని డ్రైవర్ కుటుంబసభ్యు లకు పోలీసులు సమాచారం అందజేశారు.

ఏనుగుల బీభత్సం

• ధ్వంసమైన పంటలు
• వాపోతున్న రైతులు



అడ్డూరివలసలో ఏనుగులు ధ్వంసం చేసిన కొబ్బరి మొక్కలను చూపిస్తున్న రైతు శ్రీనివాసరావు



ఏనుగులు ధ్వంసం చేసిన కోకో పంట నిల్వలు



హిందూపురంలో ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన కొబ్బరి మొక్కలు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మోటార్



లోవగూడ సమీపంలో మకాం వేసిన ఏనుగులు మకాం

పార్వతీపురం రూరల్: మండలంలో కొన్ని రోజులుగా పలు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు స్వైరవిహారం చేస్తూ రైతుల జీవితాలతో చెల గాటమాడుతున్నాయి. కంటికి రెప్పలా కాపాడుకుం టున్న పంటలను గజరాజులు నాశనం చేస్తుంటే, అరికట్టడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రైతులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మంగళవారం వేకువ జాము నుంచి పార్వతీపురం మండలంలోని రావికోన పంచాయతీ అడ్డూ హిందూ పురం గ్రామాలలో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తూ బీభత్సం సృష్టించాయి.

రెండు గ్రామాల్లో అపార నష్టం

గ్రామానికి చెందిన శ్రీనివాసరావు అనే రైతు కష్ట మంతా ఏనుగుల పాలైంది. ఏపుగా పెరిగి పూత దశకు కొద్ది రోజుల్లో వచ్చే దాదాపు 200 కొబ్బరి మొక్కలను గజరాజుల గుంపు నేలమట్టం చేసింది. కాయకొచ్చిన కోకో తోటలను సైతం వదలకుండా నాశనం చేశాయి. సేకరించి ఉంచిన కోకో కాయ లను ధ్వంసం చేసి తినేశాయి. అంతటితో ఆగకుం డా, పొలంలోని మోటార్‌ను ధ్వంసం చేశాయి. అలాగే, మండలంలోని హిందూపురం గ్రామంలో గుణ అనే రైతుకు చెందిన కొబ్బరి మొక్కలను ఏను గుల గుంపు ధ్వంసం చేసింది. ఈ ప్రాంతంలో ఎప్పుడు ఏనుగుల గుంపు సంచరిస్తుందో తెలియక బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం నిద్ర వీడాలి

ఏనుగుల బెడద నుంచి తమను కాపాడాలని రైతు లు, స్థానికులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి, ఏనుగుల దాడులను అరికట్టేందుకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తు న్నారు. అటవీ శాఖ అధికారులు కేవలం హెచ్చరిక లు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారని, క్షేత్ర స్థాయిలో ఎటువంటి పరిష్కార చర్యలూ తీసు కోవడం లేదని ఆరో పిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం స్పందించి రైతులను ఈ విధంగా నష్ట పెట్టకుండా, తమ పంటలను ప్రాణాలను గజరాజుల బారి నుంచి రక్షించాలని కోరుతు న్నారు.

లోవగూడలో ఏనుగులు

భామిని: మండలంలోని లోవగూడ సమీపంలోకి మంగళవారం ఏనుగుల గుంపు చేరుకుంది. మొక్క జొన్న, వరి పంటలను తినివేస్తూ పాడు చేస్తున్నా యని గిరిజన రైతులు వాపోతున్నారు. ఏనుగులు సమీపంలోని మెట్టపై మకాం వేసినట్లు ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

వైభవంగా పునర్వసు పట్టాభిషేకం

• సీతారామస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు



స్వామి సన్నిధిలో పట్టాభిషేక పూజలు జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం లోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మంగళవారం వైభవంగా జరిపించారు. వేకువ జామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరకాం డ హవన హోమం జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపంలో సీతారామస్వామి కల్యా ణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి..ఉత్సవ మూర్తులకు రామాయణంలో పట్టాభిషేకం సర్గ విన్నవించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫల రసాలతో అభిషేకం, పునర్వసు పట్టాభిషేకాన్ని జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్ర మంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసిం హాచార్యులు, వర ప్రసాద్, రామ గోపాల్, తదితరు లు పాల్గొన్నారు.

గెడ్డలో కొట్టుకుపోయిన వ్యక్తి

• గాలింపు చేపట్టిన ఎస్‌డీఆర్ఎఫ్



సోమరాజు కొట్టుకుపోయిన గెడ్డ



గాలిస్తున్న ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు

గంట్యాడ:

మండలంలోని చంద్రంపేట గెడ్డలో ఓ వ్యక్తి కొట్టుకుపోయాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆర్.వసంత గ్రామానికి చెందిన విజ్జపు సోమరాజు విజయనగరం పీడబ్ల్యూ మార్కె ట్‌లోని ఓ కిరాణా హోల్‌సేల్ దుకాణంలో పనిచేస్తు న్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గ్రామానికి వెళ్తుండగా చంద్రంపేట దాటిన తర్వాత వసంత గ్రామానికి ముందు ఉన్న గెడ్డలో ప్రమాదవశాత్తు కొట్టుకుపో యాడు. రాత్రి 12 గంటలైనా సోమరాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గ్రామ స్తులతో కలిసి వెతకసాగారు. తెల్లవార్లూ వెతికినా అచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సాయికృష్ణ, తహసీల్దార్ నీలకంఠేశ్వర రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చేపట్టారు. గల్లంతైన సోమరాజుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. గెడ్డపై ఇప్పటికైనా పాలకులు వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ గెడ్డపై వంతెన నిర్మించాలని రెం డు గ్రామాలకు చెందిన ప్రజలు మంగళవారం కలెక్ట ర్‌కు వినతిపత్రం అందజేశారు.

పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



విజయనగరం టౌన్: ఉత్తరాం ధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడి తల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహిం చారు. సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్ నిర్వహించారు. కార్యక్రమా లను ఆలయ ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు.

19న జిల్లా స్థాయి యోగాసనాల పోటీలు

నెల్లిమర్ల: స్థానిక మిమ్స్ సమీపంలోని శ్రీరామకృష్ణ ధ్యాన మందిరంలో ఈ నెల 19వ తేదీన జిల్లా స్థాయి యోగసనాల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా క్రీడా సంఘం ప్రతినిధులు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. మొత్తం ఏడు విభాగాల్లో పోటీలు ఉంటాయని, విజేతలను 25, 26వ తేదీల్లో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపి స్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారు తమ పేర్లను 17వ తేదీలోగా ఫోన్ నంబర్లు 8374904262, 8465954998 సంప్రదించాలన్నారు.



పెద్ద చెరువులో తెప్పోత్సవం

హంసవాహనంపై సిరుల తల్లి

విజయనగరం టౌన్: మంగళవాయిద్యాలు... బాణ సంచా వెలుగులు.. భక్తుల జై పైడిమాంబ.. జైజై పైడిమాంబ జయజయధ్వానాలు.. వేదపండితుల మంత్రోచ్ఛరణాల నడుమ హంస వాహనంపై పసిడి కాంతుల పైడితల్లి విజయనగరం పెద్ద చెరు వులో మంగళవారం సాయంత్రం జలవిహారం చేశారు. భక్తులకు చల్లని ఆశీస్సులు అందించారు. అమ్మవారి జలవిహారాన్ని చూసేందుకు సున్నంబట్టీ వీధి సమీపంలోని చెరువు గట్టు వద్దకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారు సాక్షాత్కరించిన చెరువులో మూడుసార్లు జలవిహారం చేస్తుంటే.. గట్టుపై ఉండి కళ్లార్పకుండా తిలకించారు. పైడితల్ల మ్మా.. చల్లంగా చూడమ్మా అంటూ స్మరించారు. చల్లని తల్లి కరుణాక టాక్షాలను అందుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు సాగిన తెప్పోత్సవానికి జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయగా, ఆలయ ఇన్‌చా ర్జి ఈఓ కె.శిరీష పర్యవేక్షించారు.

వనంగుడిలో వేదస్వస్తి

వనంగుడిలో ముందుగా వేదపండితులు వేదస్వస్తి నిర్వహించారు. రాజాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి, అధికార భాషా సం ఘం పూర్వపు సభ్యులు డాక్టర్ ఎ.గోపాలరావు వ్యాఖ్యానం చేశారు. వేదస్వస్తి చెప్పిన బ్రాహ్మణు లకు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష దుశ్శా లువ, నగదు బహుమతితో సత్కరించారు. అనం తరం అమ్మవారికి పారాయణం, ఆధ్యాత్మిక అంశా లను, పైడితల్లి అమ్మవారి భజనలను వినిపించారు.

పైడితల్లికి స్తపనం

తెప్పోత్సవానికి ముందు పైడితల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి వనంగుడిలో ఆలయ అధికారులు, పైడిత ల్లి దీక్షాపరులు స్తపన కార్యక్రమం నిర్వహించారు. వేదమంత్రాల సాక్షిగా పంచామృ తాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని అలంకరించి ఆలయం చుట్టూ మూడుమూర్లు ప్రదిక్షణ జరిపారు. అనంతరం పల్లకిలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి, భాజాభజంత్రీలు, మేళతాళాలతో భారీ ఊరేగింపుగా సున్నంబట్టీవీధి మీదుగా పెద్దచెరువు వద్దకు తెప్పోత్సవానికి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న హంసవాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి జలవిహారం జరిపించారు. ఉత్సవంలో ఆలయ సిరిమాను అర్చకులు బంటుపల్లి వెంకటరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఉత్సవ ప్రత్యేకాధికారి మూర్తి, దీక్షాపరులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న ఆలయ సహాయ కమిషనర్ శిరీష